లోకేశ్‌ది దిగజారుడు రాజకీయం

వాసుబాబుపై ఆరోపణలు దారుణం

గణపవరం : యువగళం పాదయాత్ర సందర్భంగా గణపవరంలో ఆదివారం రాత్రి జరిగిన సభలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుపై చేసిన అవినీతి ఆరోపణలు టీడీపీ కార్యదర్శి నారా లోకేశ్ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. సోమవారం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోన్న వాసుబాబుపై అవినీతి ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వాసుబాబు నెగ్గిన తర్వాత అక్రమంగా తవ్విన చెరువులను చూపించాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో 78 గ్రామ సచివాలయ భవనాలు, 78 ఆర్బీకేలు, 68 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణం, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, జలజీవన్ మిషన్ పనులు, ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం వంటివి అభివృద్ధి కాదా అని వారు ప్రశ్నించారు. ఉంగుటూరుతోపాటు జిల్లాలో టీడీపీ హయాంలో ఎమ్మెల్యేలు చేసిన అవినీతి ఆ పార్టీని ప్రజలు చావుదెబ్బకొట్టిన విషయాన్ని లోకేశ్ గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ఇసుక రీచ్‌లు, గోదావరి, తాడిపూడి కాలువ గట్లు, కొండలు, కంకర క్వారీలను టీడీపీ నేతలు అక్రమమార్గంలో అమ్ముకుని రూ.కోట్లకు పడగలెత్తారని వివరించారు. కొల్లేరులో వేల ఎకరాలు ఎవరి హయాంలో అక్రమంగా చేపల చెరువులుగా మారాయో, ఎంత మంది టీడీపీ నాయకులు బినామీ పేర్లతో వందల ఎకరాలు చేజిక్కించుకున్నారో, మరెంతమంది మామూళ్ల పేరుతో అక్రమంగా చెరువుల లీజులు మింగుతున్నారో సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, కనుమాల రామయ్య, జెడ్పీటీసీలు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశీ, కె.జయలక్ష్మి, తుమ్మగుంట రంగాభవాని, మండల కన్వీనర్‌లు దండురాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి సత్తిబాబు, ఏఎంసీ చైర్మన్లు మరడ హైమావతి, ఇంజేటి నీలిమ, పార్టీ జిల్లా నాయకులు నడింపల్లి సోమరాజు, మాదేటి సురేష్, జిల్లా వ్యవసాయ సలహాసంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు


భీమడోలులో మాట్లాడుతున్న ఎంపీపీ రామయ్య, పార్టీ మండల కన్వీనర్ సత్యశ్రీనివాస్, తదితరులు

కొల్లేరు ప్రజల జీవితాలను బుగ్గి చేసిన చంద్రబాబు

భీమడోలు: కొల్లేరు ప్రజలు తమ జీవితాలతో జీఓ నెంబర్ 120 తెచ్చి ఆడుకున్న ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుని క్షమించరని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. సోమవారం సాయంత్రం భీమడోలులోని సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఎంపీపీ రామయ్య మాట్లాడుతూ లోకేశ్ కొల్లేరు జీఓ గురించి తెలియదని చెప్పడం ఆయన నీచ రాజకీయాలకు పరాకాష్ట అని చెప్పారు. జీఓ 120కి బదులు జీఓ 170 రద్దు చేస్తానని చెప్పడం కొల్లేరు ప్రజలపై ఉన్న ప్రేమేంటో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ టీడీపీకి పబ్లిసిటీ కోసమే లోకేశ్ పాదయాత్ర చేస్తున్నట్టు చెప్పారు. పార్టీ జిల్లా నిర్వాహక కమిటీ సభ్యుడు, జగన్ సేవా దళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగా మాట్లాడుతూ టీడీపీ హయాంలో అవినీతి వల్లే ఓటమి చెందారన్న విషయాన్ని మరవవద్దని లోకేశ్‌కు హితవు పలికారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ హసేనా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో ముస్లింలకు చోటు ఇవ్వని విషయాన్ని గుర్తుచేశారు. వాసన్న హయాంలోనే భీమడోలు మసీదులో మౌలిక వసతులు కల్పన సాధ్యమైందన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా మాట్లాడుతూ వాసుబాబు హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని వివరించారు. పార్టీ మండల కన్వీనర్ సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ లోకేశ్ తన తండ్రి హయాంలో జరిగిన ఐటీ కేసుపై ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. సమావేశంలో సర్పంచులు పాము సునీతామాన్‌సింగ్, షేక్ రహీమాబేగం హసేనా, భలే రాంబాబు, ఎంపీటీసీ ఆల్తి గోపి, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, సచివాలయ కన్వీనర్ సురేష్, నాయకులు జంగం శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. 10 లక్షల మంజూరుపై ఎంపీకి కృతజ్ఞతలు


ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్

దెందులూరు: పోతునూరు గ్రామాభివృద్ధికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూ.10 లక్షలు మంజూరు చేయడంపై సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఏలూరు కార్యాలయంలో ఎంపీ శ్రీధర్‌ను వారు కలిశారు. ఎంపీ కేటాయించిన రూ. 10లక్షల నిధులకు అదనంగా గ్రామానికి చెందిన దాతలు, ట్రస్టు సభ్యులు మరిన్ని నిధులు ఇవ్వడంతో శ్మశానం, ప్రహరీ, షెడ్డు నిర్మాణం, ఇంకా పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని వారు తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జీ), గ్రామస్తులు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే కొఠారు గ్రామస్తులు తెలిపిన సమస్యలను ఎంపీకి వివరించడంతో ఆయన ఎంపీ నిధులు మంజూరు చేశారని వివరించారు.

కొత్తగూడెం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం


కొత్తగూడెం ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తాడేపల్లి రమణిని సన్మానిస్తున్న కామిరెడ్డి నాని తదితరులు

దెందులూరు: కొత్తగూడెం ఉప సర్పంచ్‌గా తాడేపల్లి రమణి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీ పులవర్తి వరమణి, జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, సొసైటీ డైరెక్టర్ ఉదయ్, సత్తిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎంపిక


జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణారావు


స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎల్‌వీడీ రవిబాబు


కోఆర్డినేటర్ కే రాజగోపాల్

దెందులూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం సోమవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆర్‌ఐపీఈ, గోపన్నపాలెం హెచ్‌ఎం డాక్టర్ ఎం.మనోహర్ పర్యవేక్షణలో దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా జాయింట్ సెక్రటరీగా పోతునూరు ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు ఎంపికయ్యారు. దెందులూరు నియోజకవర్గ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌గా మేధినరావుపాలెం ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌వీడీ రవిబాబు నియమితులయ్యారు. దెందులూరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వంగూరు ఫిజికల్ డైరెక్టర్ కే.రాజగోపాల్ నియమితులయ్యారు. దెందులూరు మండల స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్‌గా జే.సురేష్‌కుమార్ నియమితులయ్యారు. జిల్లా పోటీకి దెందులూరు నియోజకవర్గం నుంచి నియమితులైన నలుగురిని డాక్టర్ మనోహర్, ఎంఈఓ ప్రసాద్ అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సూర్యనారాయణ



పెదవేగి : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు పెదవేగి మండలానికి చెందిన ద్రోణంరాజు సూర్యనారాయణ ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్ధవాస్ చెప్పారు. సోమవారం ఎంఈఓ తన కార్యాలయంలో మాట్లాడుతూ సూర్యనారాయణ ప్రస్తుతం అంకన్నగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. 1987 జనవరిలో విధుల్లో చేరిన ఈయన 36 ఏళ్ల సర్వీసులో ఎన్నో అవార్డులు పొందారు.

ఉత్తమ సేవలకు అవార్డు

ఉంగుటూరు: నారాయణపురం ఎన్‌టీఆర్ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుడు తీడ శ్రీధర్ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన అవార్డు అందుకోనున్నారు. 25 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఆయన బెస్ట్ స్కూలు అవార్డు, విద్యామేళా అవార్డు, బెస్టు శానిటేషన్ అవార్డు అందుకున్నారు. చేబ్రోలు సింహాద్రినగర్ పాఠశాలకు 20 సెంట్లు స్థలాన్ని ఉదారంగా అందజేశారు. శ్రీధర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పెదపాడు: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పెదపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అధిక ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలు నశించాలని కోరుతూ నినాదాలు చేసారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. మండల తహసీల్దార్ విజయకుమార్ రాజుకు సీపీఎం, కార్యకర్తలు నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఆచార్య మాతాజీలకు శిక్షణ

ద్వారకాతిరుమల: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయాల వద్ద నిర్వహించే, బాల వికాస కేంద్రాల అచార్య మాతాజీలకు రెండు రోజుల శిక్షణా తరగతులను శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండపంలో సోమవారం ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమరసత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు మాట్లాడుతూ నిరంతరం నేర్చుకుంటూ, ఇతరులకు నేర్పగలిగేవారే గురువులని అన్నారు. ఆ స్థానంలో మీరుంటూ విద్యార్థులకు క్రమశిక్షణ, దైవభక్తి, దేశభక్తి, మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పుతూ సృజనాత్మక శక్తిని వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో 175 మంది మాతాజీలు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట


పూళ్లలో మాట్లాడుతున్న డీడీ రామచంద్రరావు

భీమడోలు: పాడిపరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ ఎ.రామచంద్రరావు అన్నారు. పూళ్ల, గుండుగొలను గ్రామాల్లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగనన్న పాల వెల్లువలో భాగంగా పాడి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పాడి గేదెలు, ఆవులకు రుణమేళా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షతని నిర్వహించిన కార్యక్రమంలో డీడీ రామచంద్రరావు మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నట్టు చెప్పారు. పాడి గేదెలు, ఆవులకు సొసైటీ ద్వారా రుణాలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ పథకంలో రైతులకు లక్షలోపు రుణాలు అందిస్తారని, గేదెలు, ఆవులను కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. గేదెలు, ఆవులు పాలను విధిగా జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు అందించాలని అన్నారు. తద్వారా రైతులుకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గతంలో బ్యాంకుల నుంచి మాత్రమే రుణాలు అందించే వారని, నేడు జగనన్న ప్రభుత్వంలో డీసీసీబీల ద్వారా రైతులు రుణాలు అందించి బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. డీసీసీబీ మేనేజర్ కె.శ్రీనివాస్, ఏడీ ఐ.సాయిరమేష్, బీఎస్‌వీ లక్ష్మీనారాయణ, హెచ్ హరికృష్ణ, డి.ప్రసాద్ బాబు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి సహకరించండి


ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని కోటదిబ్బపై ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వర రావు, అధ్యాపకులు వి.వెంకట కృష్ణ తదితరులు కోరారు. సోమవారం ఎంపీని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన డిగ్రీ కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారు చదువుపై ఏకాగ్రత చూపే విధంగా భవనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఎంపీని కోరారు. కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. దీనిపై ఎంపీ శ్రీధర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించారు.

కల్నల్ కుమార్‌రాయ్ సేవలు అభినందనీయం


కల్నల్ కుమార్ రాయ్‌ను సన్మానిస్తున్న ఉమ్మడి పశ్చిమ ఎన్‌సీసీ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్‌సీసీ 19 ఆంధ్రా బెటాలియన్‌లో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అలోక్ కుమార్‌రాయ్ చేసిన సేవలు అభినందనీయమని ఎన్‌సీసీ సీనియర్ ఆఫీసర్ మేజర్ సెలీన్ రోజ్ ప్రశంసించారు. గత మూడు సంవత్సరాలుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారిగా సేవలు అందించి, ఈ నెల 8న రాజస్థాన్‌లోని సూర్ ఎన్‌సీసీ బెటాలియన్‌కు బదిలీ అయిన సందర్భంగా 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆఫీసర్స్, బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ సౌరవ్ ముఖర్జీ ఆధ్వర్యంలో కుమార్ రాయ్‌ను సోమవారం స్థానిక ఎన్‌సీసీ కార్యాలయంలో ఘన సన్మానించారు. ఈ సందర్భంగా సెలీన్ రోజ్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కూడా క్యాడెట్స్‌కు అందాల్సినన్ని సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, టీఎస్‌సీ, ఆర్‌డీసీ, ట్రైనింగ్ ఇచ్చి మచ్చలేని మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కెప్టెన్ ఎ.వీరయ్య, లెఫ్టినెంట్ కె.శివశంకర్, లెఫ్టినెంట్ ఎం.నవీన్ కుమార్, 19 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీలోని ఎస్ రామయ్య, జి.అనంత రాజ్యలక్ష్మి, టి.ప్రకాష్, బి.లాజర్ (ఏలూరు సెక్టార్), ఎంహెచ్‌ఎస్ శేఖర్ కుమార్, జి.గవరయ్య, లెఫ్టినెంట్ ఎం గౌతమ్ (భీమవరం సెక్టార్), లెఫ్టినెంట్ పీఎస్‌వీఏ రవీంద్ర, బి.స్వామి, కె.గణపతి, జి.చంద్రశేఖర్ (తణుకు సెక్టార్), ఎన్‌సీసీ ఆఫీసర్స్, ఆర్మీ సిబ్బంది, ఆఫీసు సిబ్బంది, క్యాడెట్స్ పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిపై ఫిర్యాదు


డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న దళితసేన నాయకులు

ఏలూరు (టూటౌన్): జీడిమామిడి చెట్లు నాశనం చేసిన ఫారెస్టు సిబ్బందిపై చర్యలు తీసుకొని మహిళా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ దళితసేన ఆధ్వర్యంలో సోమవారం డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ లింగపాలెం మండలం తోచిలక, రాయుడుపాలెం గ్రామాలకు చెందిన దాదాపు 25 మంది మహిళలు ప్రభుత్వ అటవీ భూమిలో పూర్వికుల నుంచి సాగు చేసుకుంటున్నారు. రెండేళ్ల క్రితం నుంచి జీడిమామిడి సాగు చేస్తున్నారు. చెట్టు పట్టాలు మంజూరు చేయాలని గతంలో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. ఆ అర్జీ విచారణలో ఉండగానే గత నెల 23న చింతలపూడి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, సిబ్బంది జీడిమామిడి చెట్లను నాశనం చేశారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరు(మెట్రో): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. సోమవారం గృహ నిర్మాణాలపై అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషాను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. గృహ నిర్మాణ సంస్థలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ.. వారి సేవలను క్రమబద్ధీకరించాలని కో రారు. మినిమం టైం స్కేల్ లేదా ఎన్‌ఎంఆర్‌లుగా లేదా హెచ్‌ఆర్ ఉద్యోగులగా గుర్తించాలన్నారు.

విజయరాయిలో సీపీఎం నిరసన

పెదవేగి : సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అధిక ధరలు, నిరుద్యోగం, పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సమరభేరి కార్యక్రమంలో భాగంగా విజయరాయిలో సీపీఎం కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయరాయి సచివాలయం ముందు ఈ ఆందోళన చేపట్టారు. కేంద్ర మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెరిగిన ధరలు, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎ.అప్పలస్వామి, రమణమ్మ, ధనమ్మ, వెంకటేశ్వర రావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

జగనన్న హౌసింగ్ కాలనీ లే అవుట్ పరిశీలన


అప్పనవీడులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ ఎండీ డాక్టరు లక్ష్మీషా

పెదపాడు: జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ ఎండీ డాక్టరు జీ లక్ష్మీషా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో మండలంలోని అప్పనవీడు జగనన్న హౌసింగ్ కాలనీ లే అవుట్‌లో చేపట్టిన గృహ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రహదారులు, నీటివసతి, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. అప్పనవీడు లేఅవుట్ 287 స్థలాలు కేటాయించారని ఇప్పటి వరకు 44 మంది నిర్మాణాలు పూర్తి చేసారని మిగతా ఇళ్ల వివిధ దశల్లో ఉన్నాయని ఎండీ షాకు అధికారులు వివరించారు. గృహ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ ఆర్ విజయరాజు, డీఈ రమాకాంత్, హౌసింగ్ డీఈ రమాకాంత్ టెక్నికల్ అసిస్టెంట్ చైతన్య పాల్గొన్నారు.

మహనీయుల కృషి ఆదర్శనీయం


ఉంగుటూరు హైస్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జి

ఉంగుటూరు: సమాజ అభివృద్ధికి మహనీయుల చేసిన కృషి ఆదర్శనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. సోమవారం ఉంగుటూరు హైస్కూల్లో మహనీయుల స్ఫూర్తిని తెలిపే కమిటీలను ఆయన అభినందించారు. హెచ్‌ఎం మీనాకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ కె.శ్రీనివాస్, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మహనీయుల ఆశయ కమిటీ ఉంగుటూరు అధ్యక్షుడు కొండా రవి, కార్యదర్శి యు.రాంబాబు, సభ్యుడు డి.జోగి నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్, బొమ్మిడి, ఎ.గోకవరం, పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

సెంటా పరీక్షలో టీచర్ కళ్యాణికి జిల్లా ప్రథమం



దెందులూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సెంటర్ ఫర్ టీచర్ అక్రిడేషన్ (సెంటా) ఆన్‌లైన్ పరీక్షలో ఏలూరు జిల్లా ఫస్ట్ సాధించిన దెందులూరు గారపాటి హైమావతి ఉన్నత పాఠశాల టీచర్ బీఎస్‌ఎన్‌కే కళ్యాణి ఉత్తమ బోటనీ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం దెందులూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పీ.రామశర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ ఆన్‌లైన్ పరీక్షలో జిల్లా ప్రథమం సాధించి ఉత్తమ ఉపాధ్యాయినిగా కళ్యాణి ఎంపికవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. ఏలూరులో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు మీదుగా మంగళవారం ఆమె అవార్డు అందుకోనున్నట్టు తెలిపారు.

వేగవరంలో వేళంగిణి మాత ఉత్సవాలు

దెందులూరు: మండలంలోని వేగవరం ఆర్‌సీఎం చర్చిలో సోమవారం స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో వేళంగిణి మాత ఉత్సవాలు నిర్వహించారు. తొలుత ఫాదర్ మోజెస్ దివ్య పూజా బలి అర్పించారు. కొత్తపల్లి, మసీదుపాడు, గోపన్నపాలెం, వేగవరం ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, డానియేన్ లెప్రసీ సెంటర్ సిస్టర్లు, ఆర్‌సీఎం సంఘ పెద్దలు, ఉపాధ్యాయులు, సంఘస్తులు పాల్గొన్నారు.

మానవతకు ఫ్రీజర్ వితరణ

పెదపాడు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్సుకు కృష్ణా జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు పొట్లూరి సీతారాం ప్రసాద్ అందించారు. తన తల్లిదండ్రులు పొట్లూరి జగన్మోహనరావు, రత్నమాణిక్యం జ్ఞాపకార్థం అందించిన ఈ ఫ్రీజర్ బాక్సును సోమవారం పెదపాడు మండలంలోని అప్పనవీడు మానవత స్వచ్ఛంద సేవాసంస్థకు ఆ సంస్థ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా అందించారు.

తెలంగాణ వెళ్లి పింఛన్ అందజేత


తెలంగాణలో ఖాదర్‌ఖాన్‌కు పింఛన్ సొమ్ము అందిస్తున్న సువర్ణ రత్నరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైద్యం నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలోని గంగారం అనే గ్రామంలో ఉన్న ఏలూరు నగరంలోని ఏడో డివిజన్‌కు చెందిన ఖాదర్‌ఖాన్ అనే వృద్ధుడికి 53వ సచివాలయం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఖండవల్లి సువర్ణ రత్నరాజు సెప్టెంబర్ నెల పింఛన్ అందజేశారు. వాలంటీర్ ప్రస్తుతం సెలవులో ఉండడంతో సువర్ణ రత్నరాజు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగారం వెళ్లి ఖాదర్‌ఖాన్‌కు సోమవారం పింఛన్ సొమ్ము అందించారు. ఈ సందర్భంగా ఖాదర్‌ఖాన్ బంధువులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంతో నిబద్ధతతో ప్రతి నెలా అందించే పింఛన్ వృద్ధుల వైద్య ఖర్చులకు, మందులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పెన్షన్ అందించిన సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

జి.కొత్తపల్లిలో 'పాలవెల్లువ'

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లిలో జగనన్న పాలవెల్లువ, రుణమేళాను సోమవారం నిర్వహించారు. ద్వారకాతిరుమల డీసీసీబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ రమేష్ మాట్లాడుతూ ఆవుకి రూ.75 వేలు, గేదెకు రూ.90 వేలు రుణం ఇస్తారన్నారు. గేదె పాలను అమూల్‌కు మాత్రమే పోయాలని సూచించారు.

జాతీయ సదస్సు విజయవంతం చేయాలి

పోలవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 2023 అటవీ సంరక్షణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నంలో సెప్టెంబర్ 12, 13 తేదీలల్లో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయసదస్సు విజయవంతం చేయాలని ఆయా సంఘాల సభ్యులు కోరారు. వెంకటరెడ్డిగూడెంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.